రహదారి విస్తరణతో ట్రాఫిక్ కష్టాలు

- 216 రోడ్డు పనులతో కొత్త చిక్కులు
- మురమళ్ల సెంటర్‌లో తరచూ ట్రాఫిక్ సమస్యలు
- రహదారిపైనే వారపు సంత
- నరక ప్రాయంగా ప్రయాణాలు



మురమళ్ల సెంటరులో నిలిచిపోయిన ట్రాఫిక్

ఐ.పోలవరం: రహదారుల విస్తరణ వల్ల ఎక్కడైనా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పుతాయి. కత్తిపూడి- ఒంగోలు జాతీయ రహదారి 216 రోడ్డు విస్తరణ పనులు ఐ.పోలవరం మండల వాసులకు కొత్త కష్టాలను తెచ్చి పెడుతోంది. కత్తిపూడి నుంచి కాకినాడ వరకు నాలుగు వరుసలు, కాకినాడ నుంచి ఒంగోలు వరకు రెండు వరుసల చొప్పున రహదారి విస్తరించారు. దీనితో వాహనల రద్దీ పెరిగింది. కాకినాడ, యానాం, రామచంద్రపురం, మండపేట వాసులు ఒంగోలు మీదుగా తిరుపతి, చెన్నై ప్రయాణాలు చేస్తున్నారు. రహదారి విస్తరణ తరువాత వాహనాల రాకపోకలు రెట్టింపయ్యాయి. ఈ రద్దీ వల్లే మురమళ్ల సెంటరులో తరచూ ట్రాఫిక్ జామ్ కావడం పరిపాటిగా మారింది.

ప్రయాణం నరకప్రాయం..

రహదారిని విస్తరించినా ఒక వైపు పంట కాలువ, మరోవైపు భవనాలు ఉండడంతో కొద్దిపాటి వాహనాలు వెళితేనే రోడ్డు కిటకిట లాడుతోంది. లారీలు, కార్లు, బస్సులు, ద్విచక్ర వాహనాల రద్దీతో మురమళ్ల సెంటరులో పలు సార్లు ట్రాఫిక్ నిలిచిపోయి వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. మురమళ్ల సెంటరు మండలానికి ముఖ ద్వారంగా నిలుస్తోంది. దీని వల్ల మండల వాసులు సైతం ఇబ్బంది పడుతున్నారు.

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పలు చోట్ల రోడ్లు వెడల్పు చేయడంతో పాటు బైపాస్ రోడ్ల నిర్మాణాలు కూడా జరిగాయి. అమలాపురం పట్టణం, ముమ్మిడివరం, పేరూరుతో సంబంధం లేకుండా బైపాస్ రోడ్ల నిర్మాణం చేశారు. చివరకు అన్నంపల్లి వద్ద సైతం మలుపులు లేకుండా బైపాస్ నిర్మించారు. కాని మురమళ్లలో ఆ పరిస్థితి లేదు. గతంలో నిర్మించిన రాఘవేంద్ర వారధి మీదుగానే 216 జాతీయ రహదారి వెళ్లడంతో మురమళ్ల గ్రామం తగలకుండా బైపాస్ రోడ్డు నిర్మాణం చేయలేని పరిస్థితి నెలకొంది. యానాంలో విస్తరించినట్టుగా ఇక్కడ రోడ్డును సైతం విస్తరించలేదు.

వారపు సంతతో అవస్థలు

యానాంలో జాతీయ రహదారికి అటూ, ఇటూ సర్వీస్ రోడ్డు నిర్మాణం చేశారు. ఇక్కడ స్థలం లేకపోవడంతో పాత రహదారినే కొంత వరకు వెడల్పు చేసి వదిలేశారు. దీని కోసమే పంట కాలువల వైపు దుకాణాలను తొలగించాల్సి వచ్చింది. అయినా రోడ్డు విస్తరణ పూర్తి స్థాయిలో జరగలేదు. ఇక బుధవారం వారపు సంత రోజు ట్రాఫిక్ నరక ప్రాయంగా మారిపోతోంది. సంతను జాతీయ రహదారి పైనే నిర్వహించాల్సి రావడంతో రోడ్డు ఇరుకుగా మారిపోతోంది. ముందు ముందు జాతీయ రహదారిపై రద్దీ మరింత పెరగనుంది. అదే జరిగితే మురమళ్ల సెంటరులో మరింత రద్దీ పెరిగి ట్రాఫిక్ ఇక్కట్లు రెట్టింపవుతాయని స్థానికులు, వాహన చోదలకు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటు ట్రావెల్స్‌ను నియంత్రించాలి

మురమళ్ల మార్కెట్ సెంటర్‌లో సాయంత్రం సమయంలో ట్రాఫిక్ విపరీతంగా ఉండడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సంత రోజున సాయంత్రం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను రహదారి పైనే నిలపడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ట్రాఫిక్ నియంత్రించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడమే కాకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలి. పోలీసుల నిరంతర నిఘా ఉండాలి.

– శీలం రమేష్, స్థానికుడు, మురమళ్ల

నియంత్రణకు ప్రత్యేక చర్యలు

మురమళ్ల సెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లే సమయంలోను, విద్యార్థులు కళాశాలలకు వెళ్లే సమయంలోను ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రజలు బస్సులు, ఆటోలు ఎక్కే సమయంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేస్తున్నాం. అంతేకాక మురమళ్ల నుంచి పాత ఇంజరం వరకు పెట్రోలింగ్ నిర్వహిస్తాం. బుధవారం సంత రోజున ట్రాఫిక్ నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం.

– మల్లిఖార్జునరెడ్డి, ఎస్సై, ఐ.పోలవరం.

మెప్మా మార్కెట్ ప్రారంభం



మెప్మా మార్కెట్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం: మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వస్తువులను తయారు చేయడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చునని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఆయన ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళా గ్రూపు సభ్యులు తయారు చేసిన పలు ఉత్పత్తులకు సంబంధించి 30 రకాల స్టాల్స్ ఏర్పాటు చేశారు. వీటిని చైర్మన్ ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జ్ కమిషనర్ పీవీ సుధాకర్‌లు పరిశీలించారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఈ మార్కెట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెల్లి అశోక్, పిల్లి నాగరాజు, మెండి కమల, సీఎంఎస్ బాస్కర్, కో ఆర్డినేటర్ రాజేశ్వరి, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆర్పీలు, నగర పంచాయతీ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పంటల పరిశోధనలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ఐ.పోలవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పి.ఎమ్ శ్రీ హైస్కూల్ ప్లస్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు అగ్రికల్చరల్ ఒకేషనల్ ఫీల్డ్ ట్రిప్‌కు అంబాజీపేట తరలివెళ్లారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో కొబ్బరి, కోకో తదితర పంటలపై చేపడుతున్న పరిశోధనలపై విద్యార్థులకు కేంద్రీయ శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధన్‌రావు, అనూష పలు విషయాలపై అవగాహన కల్పించారు. కొబ్బరి, కోకో, పంటలపై తెగుళ్ల గురించి, నివారణ పద్ధతులు వివరించారు. విద్యార్థులతో పాటు బయాలజీ ఉపాధ్యాయుడు ఎం.శాంత కుమార్, అగ్రికల్చరల్ ఒకేషనల్ ఉపాధ్యాయిని జి.రమ్య, ఆటోమోటీవ్ ఒకేషనల్ ఉపాధ్యాయుడు కె. సతీష్ పాల్గొన్నారు.

గ్రామసభలతో భూ సమస్యల పరిష్కారం



గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ త్రినాథరావు

- ఉప్పంగలలో రెవెన్యూ రీ సర్వే గ్రామసభ
- సమస్యల పరిష్కారం కోరుతూ 118 వినతులు

తాళ్లరేవు: రీ-సర్వే భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభ శుక్రవారం ఉప్పంగల గ్రామంలో జరిగింది. స్థానిక పంచాయతీ కార్యలయం వద్ద తహసీల్దార్ త్రినాథరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శాఖ శంకరుడు, కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావులు హాజరై మాట్లాడారు. గతంలో నిర్వహించిన రీసర్వేలో ఏవైనా పొరపాట్లు జరిగితే సరిదిద్దుకునే అవకాశం కోసమే ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. వీటితో పాటు ఎటువంటి భూ సమస్యలు ఉన్నా పరిష్కరించడం జరుగుతుందన్నారు. తహసీల్దార్ త్రినాధరావు మాట్లాడుతూ భూ సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయతీ పరిధిలో 118 వినతులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎం.సూరిబాబు, రీసర్వే డీటీ వీరబాబు, ఆర్ఐ జి. రామకృష్ణ, మండల సర్వేయర్ ఎండీ షఫీవుల్లా, నాయకులు దవులూరి శ్రీరామ్మూర్తి, పలు సచివాలయాల సర్వేయర్‌లు పాల్గొన్నారు.

భవిత కేంద్రం సందర్శన



ప్రతిభా సామర్థ్యాలను పరిశీలిస్తున్న సత్యనారాయణ

అల్లవరం: మండలంలోని గోడిలో ప్రత్యేక అవసరాల పిల్లల భవిత కేంద్రాన్ని జిల్లా సహిత విద్యా సమన్వయ కర్త ఎంవీవీ సత్యనారాయణ శుక్రవారం సందర్శించి, పిల్లల ప్రతిభా సామార్థ్యలను పరీక్షించారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని అలవెన్సులు విడుదల చేయడం జరిగిందన్నారు. రవాణాకి రూ. 3 వేలు, గృహ ఆధారిత భత్యం రూ. 3 వేలు, ఎస్కార్ట్‌కి రూ.3 వేలు, బాలికల స్టైఫండ్ రూ.2 వేలు చొప్పున వారి తల్లుల ఖాతాల్లోకి నవంబర్ నెలలో జమ చేయడం జరిగిందన్నారు. ఆలిమ్‌కో సంస్థ ఆధ్వర్యంలో ఉపకరణాలను పిల్లలకు అందిస్తామన్నారు.

పీడబ్ల్యూడీ ఓచర్ పెయిడ్ సిబ్బంది ధర్నా

యానాం: యానాం పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో ఓచర్ పెయిడ్ ఉద్యోగులుగా గత కొన్నేళ్లుగా పని చేస్తున్న తమకు ప్రభుత్వం ప్రకటించిన వేతన పెంపును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అధిక సంఖ్యలో సిబ్బంది స్థానిక పీడబ్ల్యూడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రూ.10 వేల జీతాన్ని రూ.18 వేలు చేస్తున్నామని రెండేళ్ల క్రితం సీఎం రంగసామి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారని కాని ఇచ్చిన హామీని ఇప్పటి వరకు నిలుపుకోలేదన్నారు. పుదుచ్చేరి వ్యాప్తంగా 1,202 మంది ఓచర్ పెయిడ్ సిబ్బంది పని చేస్తున్నారన్నారు. నాలుగు రీజియన్‌లకు సంబంధించి సీనియారిటీ లిస్టు ప్రకారం తమను పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్రి నాగబాబు, కలిదిండి అచ్యుతరామరాజు, కాలాడి నాగేశ్వరరావు, చల్లా శ్రీనివాస్, చీకట్ల శ్రీనివాస్, మన్నే మురళీ, పంపన అప్పన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం నిలిపివేత



సుంకరపాలెం వద్ద అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణం

తాళ్లరేవు: జాతీయ రహదారి 216 చెంతన సుంకరపాలెం వద్ద అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని అధికారులు నిలిపి వేశారు. యానాంకు చెందిన కొందరు వ్యక్తులు ఈ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిసింది. సర్వే నెంబరు 105లో జరుగుతున్న ఈ నిర్మాణం వెనుక వైపున ఊట కాలువ గట్టును కూడా ఆక్రమించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై స్థానిక నాయకుడు, విశ్వజన కళా మండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు స్థానిక పంచాయతీ, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణంపై పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధను వివరణ కోరగా నిర్మాణానికి సంబంధించి ఎటువంటి అనుమతులు తీసుకోలేదన్నారు. పలువురి ఫిర్యాదు మేరకు నిర్మాణాన్ని నిలిపి వేయించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

- వెనుక నుంచి బైకుతో ఢీకొట్టి యువకుల పరారు



గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణ

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇద్దరు యువకులు మోటారు సైకిల్‌పై వేగంగా వచ్చి మరో మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని బలంగా ఢీ కొట్టి పరారయ్యారు. ప్రమాదంలో ముమ్మిడివరం మండలం అనంతవరానికి చెందిన కొండమంచిలి సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని తొలుత సమీపంలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి అత్యవసర వైద్యం అందించారు. అటు పిమ్మట స్థానిక కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరారైన యువకులు అయినవిల్లి మండలం తొత్తరమూడికి చెందిన వారని పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి కారణమైన మోటారు సైకిల్‌ను ఘటనా స్థలంలోనే వదిలేసి ఆ యువకులు పరారయ్యారు. పట్టణ ఎస్సై కిషోర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుస్తుల కొనుగోలుకు నగదు జమ

యానాం: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలో ఎస్సీ, ఎస్టీలకు దుస్తుల కొనుగోలుకు సంబంధించి ఆది ద్రావిడ శాఖ ద్వారా మంజూరైన రూ.వెయ్యి నగదును డీబీటీ పద్ధతి ద్వారా లబ్ధిదారుల అకౌంట్లకు జమ చేయనున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల్లోని 18 ఏళ్లు నిండిన వారికి, ఎరుపు, పసుపు రంగు రేషన్ కార్డు దారులకు దోవతి, చీర కొనుగోలుకు ఈ మొత్తాన్ని ఇస్తున్నట్లు తెలిపారు.

సమాచారం హక్కు చట్టంపై అవగాహన

అయినవిల్లి: సమాచారం హక్కుచట్టం పై మండల వ్యవసాయ అధికారి వై. శోభ అయినవిల్లి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం అవగాహన కల్పించారు. పారదర్శక పాలన అందించడంతో పాటు ప్రజలకు జవాబుదారీ తనం కలిగి ఉండటమే దీని ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రైతులకు సమాచారం ఇవ్వవలసిన బాధ్యత అధికారుపై ఉందన్నారు. ప్రతి రైతు సమాచారం హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండలన్నారు. అధిక సంఖ్యలో రైతు నాయకులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో పశు గణన

అమలాపురం రూరల్: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కరాటం ప్రసన్న ప్రవీణ్ ఆధ్వర్యంలో భారత్ పశు గణన కార్యక్రమం శుక్రవారం జరిగింది. గ్రామంలో గేదెలు, ఆవులు, మేకలు, పందులు, కోళ్లు మొదలైన 16 రకాల పెంపుడు జంతువుల వివరాలను సచివాలయం సిబ్బంది సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు సత్తి ఆదిలక్ష్మి, వెంకటేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కే.మనోహర్, కార్యదర్శి స్వాతి, వీఆర్వో గంధం దొరబాబు, వ్యవసాయ శాఖ అధికారిణి ఎస్.వెంకటలక్ష్మి, వెటర్నరీ అసిస్టెంట్ షేక్ అమీర్, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తాళ్లరేవులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తాళ్లరేవు: సుమారు 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు కోరంగి ఎస్సై పి.సత్యన్నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లేత పసుపు రంగు చొక్కా నలుపురంగు నిక్కరు ధరించి ఉన్న వ్యక్తి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా అపస్మారక స్థితిలోకి చేరాడు. అతడ్ని 108లో తాళ్లరేవు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో భద్ర పరచినట్లు తెలిపారు.

అవకతవకలపై విచారణ

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రు గ్రామంలో ఉన్నతాధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ గ్రామంలో డ్వాక్రా యానిమేటర్లు రుణాలు మంజూరులోనూ, తిరిగి కట్టే సమయంలో అవకతవకలకు, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏపీవో శామ్యూల్ విచారణాధికారిగా హాజరై ఫిర్యాదు చేసిన నాలుగు గ్రూపుల సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. వారు మాట్లాడుతూ తాము రుణాలు తీసుకుని, తిరిగి సకాలంలో చెల్లింపులు జరుపుతున్నామన్నారు. కానీ మోసపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి విచారణ చేసి తమకు న్యాయం చేయాలంటూ కోరారు. శామ్యూల్ మాట్లాడుతూ సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 15 రోజుల్లో ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బీర సత్యకుమారి, శ్రీనిధి కో ఆర్డినేటర్ ప్రసన్న, రమాకాంత్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిత్యాన్నదాన పథకానికి విరాళం



కుటుంబ సభ్యులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామానికి చెందిన కలగ లక్ష్మీ ప్రసన్న కుటుంబ సభ్యులు శుక్రవారం రూ.10,116లు విరాళంగా అందజేశారు. నగదును ఆలయ ప్రధాన అర్చకులు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తికి అందజేశారు. దాతను వేద మంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

రేపు అమ్మవారికి సారె సమర్పణ

అమలాపురం టౌన్: స్థానిక రవణం వీధిలో కొలువైన మహిషాసుర మర్ధిని అమ్మవారికి ఆదివారం ఉదయం మహిళలతో సారె సమర్పణ కార్యక్రమం జరగనుంది. అమ్మవారికి పట్టు వస్త్రాలు, పూలు, పలు రకాల నైవేద్యాలు, పండ్లు, గాజులతో పాటు సారె సమర్పిస్తారు. ఆదివారం ఉదయం 8 గంటలకు మహిపాల వీధిలోని వినాయక ఆలయం వద్ద నుంచి మహిళలు అమ్మవారి సారె ఊరేగింపు నిర్వహిస్తారని రవణంవీధి సారె సమర్పణ నిర్వాహకులు తెలిపారు. మహిళలు ఉదయం 8 గంటల లోపు సారెతో సిద్ధంగా ఉండాలని వారు సూచించారు.

ఉపాధి పనులకు తీర్మానం



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: ఉపాధి నిధులను వినియోగించుకొని కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటుగా గ్రామాభివృద్ధి సాధించుకోవచ్చునని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. కొమరగిరి పట్నంలో సర్పంచ్ రాపాక విజయలక్ష్మి అధ్యక్షతన ఉపాధి పనులపై గ్రామ సభ నిర్వహించారు. రూ. 80 లక్షల నిధులతో 130 పనులకు గ్రామ సభలో తీర్మానం చేశారు. 60 శాతం నిధులు వేతన దారులకు, 40 శాతం గ్రామాభివృద్ధికి ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఉపాధి కూలీలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, ఏపీఓ శ్రీనుబాబు, కార్యదర్శి చిక్కం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బీవీ రమణయ్య చిరస్మరణీయులు

ఉప్పలగుప్తం: రిపబ్లికన్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బీవీ రమణయ్య సేవలు చిరస్మరణీయమని మాల మహానాడు మండల కన్వీనర్ కొంకి వెంకట బాబ్జి అన్నారు. మండలంలోని వానపల్లి పాలెం పంచాయతీ పరిధి బీవీ రమణయ్య నగర్‌లో శుక్రవారం బాబ్జి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీ రమణయ్య విగ్రహావిష్కరణకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముత్తాబత్తుల వజ్రం, పినిపే నాగేశ్వరరావు, కొల్లు చిన్నారి, గుత్తాల దుర్గ, కొల్లు వెంకట్రావు, పెట్టా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆవుదూడకు శస్త్ర చికిత్స విజయవంతం



ఆవు దూడతో డాక్టర్ విజయరెడ్డి, గోశాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణ రోడ్లపై సంచరించే రెండేళ్ల ఆవు దూడకు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. ఈ దూడను స్థానిక శ్రీ గౌతమ మహర్షి గో సంరక్షణ సమితి గోశాల చేరదీసి వైద్య సదుపాయాన్ని కల్పించింది. గోశాలలో కోలు కుంటున్న ఆ దూడకు అమలాపురం పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం శస్త్ర చికిత్స చేశారు. ఆవు దూడ కాలికి జరిగిన శస్త్ర చికిత్స విజయవంతమైందని డాక్టర్ విజయరెడ్డి తెలిపారు.

దేవగుప్తంలో రెండు చోట్ల చోరీ

అల్లవరం: దేవగుప్తంలో గురువారం రాత్రి హైస్కూల్ సమీపంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయం, సీజీజీబీ బ్యాంక్ ఎదురుగా ఉన్న బట్టల షాపులో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి ఆలయంలోని హూండీని పెకలించి నగదును అపహరించారు. నవ్యశ్రీ బట్టల షాపులో రూ. 1500లు చోరీ చేశారు. బాధితులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీ చేయడానికి అనువుగా విద్యుత్ స్తంభాలకు ఉన్న బల్బులు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ ఫుటేజీ ఆధారంగా విచారణ చేస్తున్నామని ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

త్రాచు పాము హల్ చల్



త్రాచు పామును బంధిస్తున్న గణేష్‌వర్మ

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం మహిపాల చెరువు కడలి దుర్గారావు ఇంటివద్ద శుక్రవారం త్రాచు పాము హల్ చల్ చేసింది. దీంతో దుర్గారావు కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు భయాందోళనకు గురై బీమన పల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం ఇచ్చారు. వర్మ అక్కడకు చేరుకొని త్రాచు పామును బంధించి దూర ప్రాంతంలో వదిలి పెట్టారు.

స్థానికుల దాడిలో కొండ చిలువ హతం



హతమైన కొండ చిలువ

ఐ.పోలవరం: గోదావరి నదీ పాయలో మత్స్యకారుల వలకు చిక్కిన కొండ చిలువను స్థానికులు కొట్టి చంపిన ఘటన ఐ.పోలవరం మండలం పశువుల్లంకలో చోటు చేసుకుంది. పశువుల్లంక సలాదివారిపాలెం వైఎస్సార్ వారధి వద్ద మత్స్యకారులు చేపల వేట కోసం వేసిన వలలో 16 అడుగుల భారీ కొండచిలువ చిక్కుకుంది. దానిని మత్స్యకారులు నదీ తీరంలో వదిలేసి వెళ్లిపోయారు. దీనిని చూసిన స్థానికులు భయాందోళనకు గురై హత మార్చారు. ఈ ఘటన ప్రకృతి ప్రేమికులను ఆందోళనకు గురి చేసింది. ఇటీవల వచ్చిన భారీ వరదలకు ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకు వచ్చిందని స్థానికులు చెబుతున్నారు.

ఖాతాల్లో రేషన్ నగదు జమ

యానాం: యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరిల్లో ఉచిత బియ్యం పంపిణీకి బదులు ఆయా రేషన్ కార్డుదారుల ఖాతాల్లోకి రెండు నెలలకు సంబంధించి నగదు బదిలీని డీబీటీ పద్ధతి ద్వారా వేసినట్లు శుక్రవారం సివిల్ సప్లయిస్ అధికారులు తెలిపారు. ఉచిత బియ్యం పథకం ద్వారా ఎరుపు రంగు రేషన్ కార్డు దారులకు నెలకు రూ.600 చొప్పున రూ.1200లు ఆగష్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి బ్యాంక్ అకౌంట్లలో జమ చేసినట్లు తెలిపారు. పసుపు రంగు కార్డు దారులకు నెలకు రూ.300 చొప్పున రెండు నెలలకు రూ.600 జమ చేశామన్నారు.

ఓఎంఆర్ పద్ధతిలోనే మూల్యాంకనం

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్‌లలో పీడబ్ల్యూడీ శాఖలో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంజినీరు(సివిల్) పోస్టుల భర్తీకి ఈ నెల 27న నిర్వహిస్తున్న పోటీ పరీక్షకు ఓఎంఆర్ షీట్ లోనే అభ్యర్థులు తమ సమాధానాలు నింపాల్సి ఉంటుందని శుక్రవారం పుదుచ్చేరి చీఫ్ ఇంజినీరు ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు పేపర్-1, పేపర్-2 రెండు ప్రశ్నా పత్రాలు ఇస్తారన్నారు. పేపర్ 1, 2లకు హాజరైన వారివి మాత్రమే మూల్యాంకనం చేస్తారన్నారు. ఒక పేపర్‌కు మాత్రమే హాజరయ్యే వారి ప్రశ్నాపత్రం మూల్యాంకనం చేయరని అభ్యర్థులు గ్రహించాలని కోరారు.

తీరు మారకుంటే ఆందోళన తప్పదు

యానాం: నియోజకవర్గ ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితంగా మారుతుందని పలు ఫిర్యాదులు వస్తున్నాయని సమస్య పై దృష్టి సారించి తాగునీటి నాణ్యతను పెంచాలని తాను ఎన్నోసార్లు హెచ్చరిస్తున్నా సంబంధిత అధికారుల తీరు మారడం లేదని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కలుషిత నీరు సరఫరా అవుతుండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఈ సమస్యపై తాను అధికారులతో మాట్లాడి పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని ఎప్పటికప్పుడు ఫిల్టర్ చేసే ప్రక్రియలో ప్రమాణాలు పాటించాలని కోరినట్లు తెలిపారు. శాసన సభ్యుడిగా ఉన్న తనపై తాగునీటి సరఫరా విషయంలో ఇతరుల నుంచి విమర్శలు వచ్చేలా అధికారులు ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. అధికారుల తీరు మారకపోతే పెద్ద ఎత్తున ప్రజలతో ఆందోళన చేయడానికి సైతం వెనుకాడనని పేర్కొన్నారు.

వార్డు సభ్యుడికి ఎంపీ పరామర్శ



నాగబాబును పరామర్శిస్తున్న ఎంపీ హరీష్

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి పంచాయతీ 5వ వార్డు సభ్యుడు నాగిరెడ్డి నాగబాబు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. అమలాపురం పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్ మాధుర్ శుక్రవారం ఆయనను పరామర్శించారు. ఎంపీతో పాటు అరిగెల వెంకట మునలయ్య, సలాది నాగరాజు, దేశంశెట్టి లక్ష్మీ నారాయణ, మద్దింశెట్టి సీతారామ స్వామి, మంచెం బాలకృష్ణ, మద్దింశెట్టి ప్రసాద్, గనిశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వైస్ ప్రిన్సిపాల్‌గా రత్నప్రభ నియామకం

యానాం: యానాం ఎస్‌టిపిపి ప్రభుత్వ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా గాలిదేవర రత్నప్రభ కు పదోన్నతి ఇచ్చి నియమిస్తూ శుక్రవారం డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ పి ప్రియదర్శిని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ పుదుచ్చేరి వ్యాప్తంగా 10 మంది అధ్యాపకులకు సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతి కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్న కె ఉమ బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో రత్నప్రభను నియమించారు.